# పిచ్చి గంగి

## కల్యాణ సుందరీ జగన్నాథ్

**క**ల్యాణ సుందరి పేరు చెప్పగానే స్ఫురించే కథ అలరాస పుట్టిళ్లు. ఆమె రాసిన కథలు యిరవైకు మించి వుండకపోయినా, అన్నీ ఆణిముత్యాలే. 1941లో భారతిలో ఆమె మొదటి కథ ప్రచురితమైంది. 1962 భారతి ఉగాది సంచికలో అలరాస పుట్టిళ్లు వెలువడి తెలుగునాట సంచలనం సృష్టించింది. మల్లంపల్లి సోమశేఖరశర్మ, మల్లాది రామకృష్ణ శాస్త్రి లాంటి మహామహుల పోత్సాహం యిామెకు పుష్కలంగా లభించింది. కల్యాణ సుందరీ జగన్నాథ్ రాసిలో కంటె వాసిలో ఖ్యాతి గడించారు. నాలుగేళ్ల క్రితం ఆమె కాలధర్మం చెందారు.

**'ట**ప్, టప్' మంటూ, కారు, మెల్లిమెల్లిగా నడుస్తూ దానంతటదే ఆగిపోయింది.

"ఛ, ఛ!" అని విసుక్కుంటూ మామయ్య కోపంగా ఎగిరి పడ్డారు - కారు లోంచీ కూడా.

"సరిపోయిందిలే. మధ్య దారిలోనే నిల్చిపోయిందే బండి. వెళ్లేది శుభకార్యం, శకునం బాగా లేదే!" అంది అత్తయ్య.

"అదేమిటమ్మా నాకు వళ్లు మండిపోతుంది, శకునాలేమిటి! నీ మూఢ నమ్మకాలు మార్చుకోడం మంచిది, ఇహనైనా, ఇది ఆధునిక యుగం' అంది విసుగ్గా శాంతి, కాలేజీ సెలవులకి ఇంటికి వచ్చిన అత్తయ్య కూతురు.

"అసలు నువ్వు బండిలో పెట్రోలు ఉన్నదీ లేనిదీ చూసుకుని మరీ బయలుదేరవద్దా? నేను ఆఫీసు నించీ వచ్చేటప్పటికి అన్నీ రెడీగా ఉంటాయనుకున్నాను. ఏమిటా నిర్లక్ష్యం?" కసిరారు, కారు డ్రైవరు రాజుని మామయ్య.

"ఏం శెయ్యమంటారు సార్. అమ్మాయిగారు తొందరపెట్టేసారు, వెంటనే బయలుదేరే పెళ్లికి అందు కోవాలి అంటా. ఆ గాభరాలో నేనూ బండి తీసేసాను' అన్నాడు రాజు దిగులుగా, తనూ బండి దిగుతూ. "అసలు అందుకనే ఈ అడ్డతోవని పట్టిచ్చానండి కారు" అన్నాడు మళ్లీ.

"అసలు పెట్రోలు ఉందో లేదో రాజు చూసుకోవద్దా ఏమిటి? అది అతని డ్యూటీ" అంది, శాంతి గడసరి తనంగా.

"అదేమిటి, తెల్లవారు జాము ముహూర్తానికి ఇప్పుడే తొందరేమిటి, అమ్మాయ్ నీకు?" అడిగింది అత్తయ్య.

"పెళ్లి అంటే కాస్త తొందరగా వెళ్లవద్దా మరి" అంది శాంతి.

కానీ నాకు తెలుసు - ఆ పెళ్లికి వచ్చే బంధుమిత్ర బృందంలో, శాంతికి కావలసిన రమేశ్ వచ్చి ఉంటాడని.

చేసేదేమీ లేక అందరమూ కారు దిగాం. ఎండ తీక్షణంగా ఉంది ఇంకా. మా నీడలు పొడుగ్గా మా ముందర పడుతున్నాయి. మా చుట్టూ భూదేవి కూడా

## ఆణిముత్యాలు

వేడి ఆవిర్లు చిమ్ముతోంది. ఎక్కడో దూరాన్న ఎండి పోయిన పొలాల్లో, నలుగురు మనుష్యులు బెద్ద తిరగ వేస్తున్నారు. ఇహమరి మనిషి సంచారం లేదు ఎక్కడా. ఆ రోడ్డు పెద్ద రహదారి కూడా కానట్టుంది. రోడ్డుకి ఇంకో పక్క కొంచం దూరంలో ఏదో ఒక పెద్ద చెట్టు కనిపించింది. ఆ చెట్టు క్రింద ఒక మనిషి కూచుని ఉన్నాడు. ఆ చుట్టూ మాత్రం, కాస్త మేర పచ్చిక పచ్చగా ఉంది. అక్కడక్కడ ఆవులు, బర్రెలూ మేస్తున్నాయి. చుట్టూ ఉన్న ఎండని తప్పించుకుంటూ, రోడ్డు దిగి, అందరమూ చెట్టుకేసి నడిచాం.

మమ్మల్ని చూసి ఆ కూచున్న వయో వృద్ధుడు లేచి నించుని, గడ్డం క్రింద చేతి కర్రని ఆనించుకొని, మాకేసి చూస్తున్నాడు.

"నీ పేరేమిటయ్యా?" అడిగారు మామయ్య.

"మాదయ్యండి. మా మనుమడు వచ్చే దాకా ఈ గొడ్లని శూత్తా ఉండమన్నాడండి నన్ను" అన్నారు ఆ వృద్ధుడు.

అంతలోనే మా కారు ప్రక్కనించీ మోటారు బైక్ మీద శరవేగంతో ఒక యువకుడు వెళ్లాడు.

"ఆ బండి ఏ ఊరు వెడుతోందో నీకు తెలుసా?" అడిగారు మామయ్య.

"మా లింగాలే నండి. పెదకామందులు శంకరం గారి బాబండి ఆయన" అన్నాడు అతను.

"మా కారులో పెట్రోలు అయిపోయింది. ఇది బొత్తిగా మారుమూల దారి. ఆయన్ని అడిగి ఎంతైనా ఇచ్చి కాస్త పెట్రోలు తెచ్చుకుందామా" అన్నారు, చిన్న స్వరంతో మామయ్య.

"మా రాజులాగా ఎల్లండి బాబయ్యా. ఇట్టాంటి ఇక్కట్టు టయానికి సహాయం చేత్తారండి ఆరు" అంటూ, ఆ మోటారు బైక్ వెళ్లిన దారికేసి, చేత్తో చూపిస్తూ, "అదిగదిగో ఆ పైన ఎగుర్తా ఆ కొంగలు కనిపిత్త ఉండాయే. అదేనండి మా లింగాల గ్రామం చెరువు. ఒక రొండడుగులు ఎత్తే గంగమ్మ గుడి. అది దాటంగానే, చెరువుకె దూరుంగా మండువా ఇల్లండి ఆరిది. అంతా నాలుగడుగులండి, ఇక్కడికి" అన్నాడు మాదయ్య, చేతిలో కర్రతో మేము వెళ్లబోయ్యే దిక్కు చూపిస్తూ. మా కందరికీ ప్రాణాలు లేచి వచ్చినట్టయినాయి.

"రాజూ, కారులో ఉన్న కేన్ తీసుకుని, ఈ తాత చెప్పిన దారినే వెళ్లి, ఎంత డబ్బు అయినా ఇచ్చి ఒక లీటరు పెట్రోలు తీసుకురా" అంది అత్తయ్య, తన పర్సులోనించి డబ్బు తీసి ఇస్తూ.

అందరమూ ఆ పెద్ద నేరేడు చెట్టు నీడని కూలబడ్డాం. కాస్త దూరంలో ఒక బావి కనిపించింది. అక్కడక్కడా, చింతలూ తుమ్మలూ మామిడి చెట్లూ ఉన్నాయి.

మాదయ్య కూర్చున్న ప్రక్కన రెండు పాత సమాధులు ఉన్నాయి, భూమికి కాస్త ఎత్తుగా, ఆ సమాదుల మీద తామరాకులో రకరకాల పువ్వులు పెట్టి ఉన్నాయి, వాడిపోతూ – ఎవరో పూజ చేసినట్టూ.

"అయ్యయ్యో! సమాధుల ప్రక్కనా కూచున్నాం!" అంది శాంతి, కాస్త చీదరించుకుంటూ, తన చేతి రుమాలు గడ్డిమీద పరిచి ముళ్లమీద కూచున్నట్టు కూచుంది.

"ఏం బయ్యం లేదండి అమ్మాయిగారు, ఆ తల్లి పిచ్చి గంగి. మీయసువంటి కన్నె పాపల్ని మా ఇదిగా కాపాడుద్దండి" అన్నాడు మాదయ్య.

"ఎవరైనా పూజ చేస్తారా ఇక్కడ?" అడిగింది అత్తయ్య.

"మరేనండమ్మా, రొండో కంటికి తెలువకుండా, కన్నె పడుసులు ఈ సుట్టుపట్లు గ్రామాల్నించి, తెల్లారగట్ట, పొద్దు పొడవక ముందరే పువ్వులు పెట్టి ఏడుకుంటారండి. ఆళ్లందరికీ మనస్సుల్లో ఎవ్వళ్లని కోరుకున్నారో ఆళ్లతో పెళ్లి అవుద్దండి. ఆయమ్మ నమ్మినాళ్లని ఇడవదు" అన్నాడు మాదయ్య దృఢ విశ్వాసంతో.

"ఎవరయ్యా ఆ పిచ్చి గంగి?" అడిగారు

## కృత్యాదిగా...

కనుల కాసారంలో
చూపు చేపపిల్లై పరిభ్రమిస్తోంది
శ్రవణబిలంలో
మాట ఒకటి శబ్దతరంగమై
ప్రతిధ్వనిస్తోంది
ఒక నిశ్వాస గాలి తరగై
నాసికాపుట బహిర్గతమౌతోంది
పెదవుల మధ్య
భూమధ్య రేఖలా
దరహాస రేఖ ఒకటి దర్శనీయమవుతోంది
వికటభ్రుకుటి
ధనుర్ధారి విడిచిన బాణంలా
గొంతుదిగని భావమొకటి
వేలిచివరి అఖాతంలోంచి
కాగితం సముద్రంలో దూకి
ఆత్మహత్య చేసుకోబోయింది
కలం పడవ భావాన్ని
అక్షరతీరం చేర్చి
అభివ్యక్తి ఊపిరులూది
ప్రాణదానం చేసింది
మొహం మొత్తంగుండా కవి
మనిషిగా నిలబడ్డాడు
సహృదయ పాఠక హృదయంపై
ప్రేమతో కలబడ్డాడు.

–సుధామ

మామయ్య.

"అది ఒక పెద్ద కతలెండి బాబయ్య. నా శిన్న తనాల్లో జరిగిందండి. ఈనాటి దాకా ఆ యమ్మని నమ్మిన ఏ పడుసూ కళ్ల నీల్లు పెట్టుకోలేదండి."

"అంటే, ఈ మధ్యనే జరిగిందన్నమాట ఈ విషయం."

"రాజు వచ్చే వరకూ కాస్త ఊసుపోతుంది. ఈ కథ ఏదో కాస్త చెప్పవయ్యా" అడిగింది శాంతి.

## మళ్ళీ తెల్లారింది

అమ్మో!
మళ్ళీ తెల్లారింది.
పల్లె పొలిమేరల్లో పారేసుకున్న నా బాల్యం
రాత్రంతా కన్న కలల సాక్షిగా
ఇంటావిడ కర్కశ స్వరంతో ముక్కలైపోయింది.
నాకంటే పెద్దవాళ్ళే!
రగ్గుల కలుగుల్లో పందికొక్కుల్లా దాక్కున్నారు
చలిలో లేత పావురంలా గజగజలాడే నేను
చిన్నారి పాదాలతో ఇల్లంతా శుభ్రం చేస్తున్నప్పుడు
ఆ ఇల్లు నా అరచేతిలో భూగోళమయింది.
ప్రతి గిన్నె, వస్తువూ నా వేలిముద్రల్ని గుర్తిస్తాయి
నేలంతా నా కన్నీటి చెమ్మలే!
అందమైన ఇంటావిడ మోహం
నాతో మాట్లాడేటప్పుడు మాత్రం
పల్లెలో జిల్లేడు కాయని గుర్తుచేస్తుంది.
నా మూల గదిలో ఏ అర్ధరాత్రో
అమ్మ చెంగు గుర్తొచ్చి మనసు బావురంటుంది
నాకూ పండగొస్తుంటుంది
అప్పుడప్పుడూ అంతా బయటికెళ్తే
తోటలో సీతాకోక చిలుకను నేనే!
ప్రతి పువ్వూ నా కోసం విరబూస్తుంది.
ముసలి మాలి దొంగాట నా కోసమే!
రాయిలాంటి నా బతుకులో
రవ్వంత హాయి దొరికే ఆ క్షణాల కోసమే
నేనింకా బతికున్నా!
అమ్మో! అదిగో!
మళ్ళీ తెల్లారింది..!!

–డా॥ చిల్లర భవానీదేవి

"ఆ మాట కొత్తే ఈ సుట్లు పట్లు గ్రామాల్లో ఆ యమ్మంటే తెలవనోళ్లే లేరండి. గురి పెట్టి రాయి ఇసిరిందంటే ఎక్కడ అనుకుంటే అక్కడ తగుల్తాది. బయపడి పోయేవాళ్లండి ఊరంతా..." అన్నాడు మాదయ్య.

"అబ్బ! ఏమి ఊరిస్తావయ్యా, చెప్పు ఆ కథ ఏదో మరి" అంది శాంతి లేచి నిటారుగా కూచుని.

మాదయ్య చెప్పనారంభించాడు.

"ఆ తల్లి ఈ ఊళ్లోనే పుట్టి పెరిగిందండి. బంగారమ్మ తమ్ముడు కూతురండి. పురిట్లోనే సంది ఒచ్చి తల్లి పోయిందండి. ఆ తమ్ముడు కొన్నాళ్లయ్యాక, ఏరే కోస్తాకి పోయేశి రొండో ఇవాహం చేసేసుకున్నాడండి."

"తల్లి పోయినప్పుటేలనించీ ఆ పాపని కన్ను రెప్పలాగా కాపాడతా ఒచ్చిందండి, బంగారమ్మ. ఇరుగు పొరుగు అమ్మలక్కల్ని బతిమాలి పాలిప్పిచ్చి, పెంచి అమ్మోరి పేరే గంగమ్మ అని పెట్టిందండి. బంగారమ్మకి ఒక్కడే ఒక్క కొడుకు సంగమయ్య. ఐదెకరాల పల్లం ఉండాదండి. కూలోళ్లతో పాటు ఆయమ్మ కూడా పనిచేస్తా పొలం పండిచ్చుకుంటూ, కొడుకునీ గంగమ్మనీ పెంచుకుంటూ కాలం గడుపుతా ఒచ్చిందండి, బంగారమ్మ."

"ఇంక సూత్తే గంగమ్మ శెక్కిన బొమ్మెల్లే తయారయ్యిందండి. ఆ పాప ఒంటి సాయ సూస్తే, ఆ ఇళ్లల్లోనే ఎవ్వళ్లకీ లేదండి అసువంటి రంగు. మేలిమి బంగారు రంగండి ఆ రంగు. అప్పుడు నేను శిన్నోణ్ణండి. గోశీలు పెట్టుకుని బర్రెల్ని మేపుతా ఉండేవాణ్ణి. నేను బర్రెల్ని కడుగుతా వుంటే, గంగమ్మ గుడ్డలు గుంజేదానికి చెరువు కాడికి ఒచ్చేది గిందాండి– ఆయమ్మ నీడ బర్రెల మీద దీపం శూపినట్టనిపిచ్చేది. కుచ్చు జడలతో, జడని పువ్వులతో, చేతి నిండా గాజులతో, కాటిక బొట్టు, పసుపు వుంటే, తిరిగి సూడనోళ్లు లేరండి. ఆడోళ్లయినా సరే మొగాళ్లయినా సరే."

"బంగారమ్మకేమో, గంగమ్మని తన కొడుక్కిచ్చి పెళ్లి చేసుకుని ఇంట్లోనే పెట్టుకుందామని, ఏనాడో తీర్మానంగా అనుకున్న మాటేనండి. ఆ మాట ఈ ఊళ్లల్లో అందరికీ తెలుసండి. అందుకని గంగమ్మకి ఎక్కణ్ణించీ కూడా మనువులు రాలేదండి. లేకుంటే కాకులు తన్నుకుపోయినట్లు తన్నుకు పోయే ఓళ్లుండి, ఏనాడో."

"ఈలోనగా ఏంవయిందంటే నండి, గంగమ్మ గుడి ఎనకాల పాపాయమ్మ, ఆయమ్మ కొడుకు రూపులయ్య

ఉండారండి. ఆళ్లకి ఒక నాలుగు ఎకరాల మాగాణి, దిబ్బ గట్రా ఉండాదండి. ఆ అర ఎకరం దిబ్బ మీద కాయ కూరలు పండిచ్చో రండి, గడ్డి వాము అక్కడే ఉండేదండి. పువ్వులు గట్రా కూడా పెంచేవారు అమ్మోరి గుడికి. పాపాయమ్మ గారికి కళ్లు చెడ్డ మసక. ఇంట్లోనే నడవడానికి కాళ్లు తడబడేయి. రూపులియ్య మామంచోడండి. తల్లిని కనిపెట్టుకుని పొలం సూసుకుంటా కుటుంబం నడిపిస్తా ఉండాడండి. బయట పనులన్నీ శెయ్యటం, ఇంట్లోకి మంచి నీళ్లు తేటం అంతా రూపులియ్యే చేసేవాడు. బియ్యం పొంగిచ్చి కొడుక్కి కంచంలో అన్నం పెట్టటంతో, పాపాయమ్మ గారి పనిసరి. తల్లి అంటే రూపులియ్యకి పాణంతో సమానం."

"ఒకే ఊళ్లో ఓళ్లు గిందా అని రూపులియ్యగారి దిబ్బమీదికి ఆవు గడ్డి కోసం గంగమ్మ ఎల్తా ఉండేది. రూపులియ్య కూడా దిబ్బ మీద పండే కాయ కూర కోసి ఇచ్చేఓడు, మోపు బరువుగా ఉంటే పిలవకుండానే, గంగమ్మ తలమీద ఎత్తిపెట్టేఓడు. అట్లా గంగమ్మకీ రూపులియ్యకీ స్నేహితం ఏర్పడ్డదండి. కాని ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకోరు. కాని ఎట్టాగో ఊళ్లో ఓళ్లకందరికీ రూపులియ్యకి, గంగమ్మ మనసు ఇచ్చింది అన్న మాట తెలిసిపోయిందండి. ఊరంతా ఉడికిపోయింది. బంగారమ్మకీ, కొడుక్కీ మట్టుకు ఈ సంగతి తెలువదు. గంగమ్మ కంటూరా అసువుంటి కొంటె పనులు తెలవనే తెలవ్వు. మొగోళ్లు నిల్చేశోట నిలవదు, అయితే ఎవ్వళ్ల కన్నా ఏదన్నా పని కావాలంటే శటుక్కున శేశిపెడ్డి. మా ఉపకార బుద్ధండి, అసలికి మొదట్నించీ.

"పొద్దు పొడిశేతలికి నీళ్లోసుకుని గంగమ్మ తల్లి గుడిసుట్టా తిరిగి ఒక దణ్ణం పెట్టుకుని, ఆ పూజారమ్మ కనకమ్మ గారిచ్చిన కుంకం కళ్లకి అద్దుకుని నొసట్లో పెట్టుకుని మరీ పనుల్లో జొరబడేదండి, గంగమ్మ గుళ్లో మంచికీ శెబ్బరికీ గంగమ్మ ముందుండేదండి. కనకమ్మ గారితోనే కూడా ఉండి గుళ్లో సేవలన్నీ శేస్తానే ఉండేదండి. గుళ్లో నుంచీ కొబ్బరి ముక్కలూ ప్రసాదాలు అంతా మా పిల్లలందరికీ ఆయమ్మే ఇచ్చేదండి. ఈ పనులు కాక రూపులియ్యగారి బియ్యం బాగుశెయ్యటం కాయలు తరగటం శేశి పెట్టెది. గుడ్డలు గుంజుకోటానికి ఎల్తే, పాపాయమ్మ గారి కోకలు కూడా జాడిచ్చి తెచ్చేది. పూజ సామాన్లు తోమి పెట్టేది. ఇంకా రూపులియ్య గంటే నుండి, గుడి సంబరాలకి గుంజలు పాతటం, పందిళ్లెయ్యటం, తోరణాలు కట్టటం గట్రా అన్నిపన్లూ ఆయన లేకుంటే నడవ వండి. అయితే ఒక సంగతండి. రూపులియ్యనీ గంగమ్మనీ గుళ్లోగాని గుడి ముందుర గాని, ఒకే పాలి శూశినోళ్లు లేరండి. రూపులియ్య మూగోడిలాగానే ఉండే ఓడండి."

"ఆ యేడు కొడుక్కీ మేనకోడలికీ పెళ్లి శెయ్యాలని కంకణం కట్టుకుంది బంగారమ్మ."

"ఒకనాడు ఏమయిందంటే నండి. అది పొద్దుటేల. శద్దణ్ణం అయ్యాక గంగమ్మ కొడవలి శేత పట్టుకుని, ఆవుకి సందిడు గడ్డి తెద్దాం పని రూపులియ్యగారి దిబ్బ మీదకి ఎల్లిందండి. అది మంచి పసికెరి కాలమా అసలే నడుం ఎత్తున పెరిగిన పచ్చిగడ్డిలో కింద పడుక్కుని ఉండా తాసు పాముని గంగమ్మ సూడలేక పోయింది. పాము తలమీద కాలు ఏసింది. ఆ పాము ఎంటనే శటుక్కున ఆయమ్మ కాలు సుట్టేసుకుంది. అంతా ఒక చిటికలో జరిగిపోయిందండి. ఆ బయ్యంతో గంగమ్మ గట్టిగా ఒక్క కేక అరిసేసింది. గడ్డివాము పక్కన వరి గడ్డి పీకుతూండ రూపులియ్య ఒక్క అంగలో దూకి ఒచ్చాడు, ఆ కేకకి. శటుక్కున గంగమ్మ శేతిలో కొడవలి లాక్కొని, "నువ్వు కాలు గట్టిగా అదిమే తొక్కి ఉంచు అట్టాగే ఉంచు, కదిల్తే కాటేత్తాది, బయపడబోకు" అంటూనే ఆ పాముని మెడ దగ్గిరిగా నరికి పారేసాడు.

## ఆహ్వానం

**నే**స్తమా... ఓ నేస్తమా!
నీవు లేనిది లోకమా
స్వప్నమై జారిపోకు
కాలమై కరిగిపోకు
సుమమువై వాడిపోకు
స్నేహమనే జీవనదిని స్వచ్ఛంగా పారనివ్వు
చంద్రవంక చూపులతో స్నేహకలువ పూయనివ్వు
చల్లని నీ చెలిమిలోకి కలిమిని రానీబోకు
కలువ చెలువతోటలోన కలుపుమొక్కనాటబోకు
అర్థాలు స్వార్థాలు వ్యర్థమైన అపార్థాలు
అమరమైన స్నేహానికి హానితెచ్చు ఆయుధాలు
వీడని దరహాసాలు వాడిపోని వసంతాలు
హృదిలోని దృఢమైన నమ్మకాలు
మదిలో నిశ్చలమైన అభిప్రాయాలు
నేను కోరుస్నేహానికి అందుకో ఆహ్వానాలు!

**-టి. అమూల్య**

## నా కలం అలసిపోదు

నా మదిలో
ఓ ఆలోచన
అలా కదలాడిందో లేదో
ఎక్కడో దాగిన నా కలం
ఉలిక్కిపడి లేస్తుంది.
ఒక్క ఉదుటున వచ్చి
నా కళ్ళముందు ప్రత్యక్షమవుతుంది.
తలమీదనున్న టోపీ తీసి సలాం చేస్తుంది.
వ్రేళ్ళసందున ఆలవోకగా యిమిడిపోయి
నా ఆజ్ఞకోసం కాచుక్కూచుంటుంది.
అప్పుడు నేను-
తపోనిష్ఠలో వున్న మౌనిలా ప్రశాంతంగా కన్పిం
చినా,
ఎగిసిపడే కవితావేశాన్ని
అక్షరాల్లో ఎలా బంధించాలా అని
మధనపడుతుంటాను.
నా గుండె చప్పుళ్ళు వింటుందో ఏమో,
తన పెదవులతో కాగితం మీద తొలిముద్దు
పెడుతుంది.
"నీ కెందుకు నేస్తం,
నేనున్నా"నంటూ
నా చెయ్యి పట్టుకుని ముందుకు నడిపిస్తుంది.
క్రమశిక్షణ గల సైనికుడిలా
తెల్లటి మైదానం మీద ఠీవిగా 'మార్చ్ ఫాస్ట్'
చేస్తుంది.
దాని అడుగుల అలజడిలో
అక్షరాలు జడివానలై కురుస్తాయి.
నా ఆలోచనలు జలపాతాలై ప్రవహిస్తాయి.
అలా...
ఎంత దూరమైనా, ఎంత కాలమైనా
పొంగుతున్న భావాల్ని కుమ్మరించేదాకా
దాని నడక ఆగదు.
తనదైన 'ముద్ర' వేసుకుంటూ సాగిపోతూనే
వుంటుంది.

ఎన్ని వందల మైళ్ళు నడిచినా,
నా కలం అలసిపోదు!

-కె. వి. భానుభూషణ్

ఎంటనే ఆమె పాదం కిందగా కొడవలి జరుపుతా "ఒక్క అంగలో దూరంగా దూకు, ఎగిరి దూకు" అన్నాడు. గంగమ్మ శటుక్కున దూకింది. రూపులియ్య అనుకున్నట్టుగా ఆ కొడవలి పాము తలలోకి ఎల్లలేదండి. గడ్డిలోకే ఎల్లింది. పాము తల అట్టాగే ఉండాది. ఆ తల ఎగిరి రూపులియ్య కాలు కాటేసి పడిపోయింది. ఇక బతకను అని రూపులియ్యకి తెలిసి పోయింది. 'నువ్వు వెంటనే పారిపో, ఇక్కడ ఉండొద్దు. మాయమ్మని ఎవ్వరు శూత్తారో దేవుడా!' అంటూ పడిపోయాడు."

"ఇదంతా, పల్లంలగొడ్లని కాస్తా ఉండా నేను సూస్తానే ఉండానా, అట్టాగే కొయ్యబారిపోయానండి. ఎట్టాగో తెప్పరిల్లి, ఒక చణంలో కర్ర కింద పారేసి ఊళ్లోకి లగెత్తుకొచ్చానండి."

"గంగమ్మగంటె, ఒక్క పరుగులో ఒచ్చి గంగమ్మ తల్లి గుళ్లో అమ్మోరి కాళ్ల ముందర పడిపోయిందండి. ఆ శబ్దానికి కనకమ్మగారు ఎనక్కి తిరిగి శూశి చేతిలో ఉండా నీళ్లు, గంగమ్మ మొకం మీద మతి ఒచ్చేదాకా శల్లిందండి. అంతేనండి బాబయ్యా ఆనాడు పోయిన మతి, ఆ గంగమ్మకి. మళ్లీ తిరిగి ఆ యమ్మ మడుసుల్లోకి రాలేదండి.

"అమ్మోరి గుళ్లోనే పడి ఉండేది. జుట్టు ముడి కూడా ఏసుకునేది కాదు. ఎంటికలన్నీ ఇరబోసుకునే ఉండేది. చెరువులో నీళ్లోసుకుని అమ్మోరికి సేవ చేసు కుంటా, పొలాలెంట ఒంటరిగా తిరుగుతూండేదండి.

"పాపాయమ్మ గారి ఇంట్లో మాత్రం ఎప్పుటెల్లేనే పనీ పాటా చేత్తానే ఉండేదండి, బుద్ధి తిరిగినప్పుడల్లా, కాని కొంతమంది రాలుగాయి పిల్లకుంకలు మాత్రం ఆయమ్మ ఆపడగానే పిచ్చి గంగి పిచ్చి గంగి అని అంటానే ఉండోళ్లండి. ఆయమ్మ పట్టిచ్చుకునేది కాదు. అసలేమీ అనేదే కాదు, ఆళ్లని కూడా. ఆ తల్లికి అదే పేరైపోయిందండి, సుట్టూ ఊళ్లల్లో కూడా.

"ఇంక పాపాయమ్మగారి మాట యాంవయిదంటే, ఉండా ఒక్క కొడుకూ పోనే పోయాడుగిందా. ఇంక ఈ బతుకు ఎందుకులే అనుకుంది. దూరపు కోస్తా నించీ, చెడి, బతకటానికి ఈ ఊరొచ్చి బాగుపడ్డ కుటుం బం అది. అందుకని ఈ ఊళ్లల్లో ఎక్కడా అయిన బందుగులు లేకపోయారు. అందుకోసం ఉండా ఆస్తిపాస్తులన్నీ గంగమ్మ తల్లి గుడికి రాసి ఇచ్చేసి ఇంట్లోనే పడి ఉండేదండి. అంత పిచ్చిలోనూ కూడా గంగమ్మకి పాపాయమ్మగారి ఇల్లూ వాకిళ్లూ తుడవటాలూ, గుడ్డలు

గుంజటాలూ, జతపడుకోటాలూ చేత్తానే ఉండేది.

"ఈ లోనగా ఇంకొక సంగతి కూడా జరిగింది లెండి. ఒకనాడు రాత్రి నడిజాముండి శిద్దయ్య కూతురు చంద్రమ్మని, ఆయన రొండో భార్య – అదొక గయ్యాళి లెండి బాబయ్యా– ఆయమ్మ తమ్ముణ్ణి పెళ్లాడనందని, అమట్న ఆ పిల్లని పట్టి కొట్టి పీకి, అట్ల ముల్లు పొయ్యిలో పెట్టిందంట, వాత లేస్తానందంట. శిద్దయ్య ఇల్లూ వాకిలీ, కొండ్రాగట్రా అంతా ఆమె తమ్ముడికే దక్కాలని కంకనం కట్టుకుండాది. శిద్దయ్యకి ఏరే పిల్లలూ లేరు. బార్య మాటకి ఎదురు శెప్పనూ లేదండి. చంద్రమ్మ శేతులు రొండూ కట్టేసి, ఆ సవితి తల్లి పొయ్యి అద్దకి ఎల్లిందంట, అట్ల ముల్లు తేటానికి, వాతలేశాదానికి. అంతేనండి, దేవుళ్లేదూ ఒక్క శిటుకలో ఆ తల్లి లేని పిల్ల చంద్రమ్మ బయటికి ఉరికి ఒకటే పరుగు పుచ్చుకుని ఆ చీకట్లో పరుగెడతా వుండారంట, పొలాల కడ్డంగా, చెరువు గట్టుమీద మర్రి చెట్టు కింద చెట్టు నీడన చీకట్లో కూశున్న పిచ్చి గంగి, ఒక్క అంగలో లేశి చంద్రమ్మ దారి కడ్డంగా నిల్చిందంట, చేతిలో రాయి పట్టుకుని, కొట్టేదానికి. ఆమట్న, చంద్రమ్మ గాభరాగా 'అక్కా పిచ్చి గంగీ, నన్ను కాపాడమ్మా కొట్టబోక' అని పెద్ద కేక పెట్టేసిందంట గట్టిగా. గంగమ్మ శటుక్కున దగ్గిరికి ఒచ్చి, శేతి కట్టు ఇప్పేసి, 'యాంమయిందమ్మా నీకు' అని అడిగిందట. చంద్రమ్మ జరిగిందంతా శెప్పి, పక్క కాట్లపూడి గ్రామంలో తన మేనత్త ఉండాదని, ఆయమ్మ కొడుకునే పెళ్లాడాలని మనస్సులో ఉండాదని, అక్కడికి పోయి పడిపోతే సాలనీ శెప్పిందంట. అంతలోకే కర్ర చేతపట్టుకుని ఊపు కుంటూ శిద్దయ్య బామరిది, శింతాలు, 'ఆగు, చంద్రా, ఆగు!' అని రంకె లేసుకుంటూ పరుగుతో వస్తా వుండాడంట, ఆ పిల్లని ఎతుక్కుంటా. గంగమ్మ ఎంటనే గట్టుకింద చంద్రమ్మని కూసోబెట్టి, దారికి అడ్డం ఒచ్చి 'ఎవడ్రా నువ్వు? ఆగు!' అని రాయి చేత్తో పట్టుకుం దంట. ఇకంతే, చింతాలు "ఏం లేమ్మా గంగమ్మా ఏం లేదు తల్లీ, చంద్రమ్మ కోసం. అంతే" అంటానే ఎనక్కి తిరిగి పరుగెత్తి పారిపోయాడంట. కాట్ల పూడి దాకా చంద్రమ్మకి గంగమ్మ తోడుగా ఎల్లిందంట. ఆ నోటా ఈ నోటా, చంద్రమ్మ పెళ్లి మాట ఊరూరా పొక్కింది. అప్పుటేలనించీ, పొద్దుటేల గుడికి వచ్చే ఆడపిల్లలు, గుడి ముందర కూసున్న గంగమ్మకి కూడా మొక్కి ఎల్లే ఓళ్లంట. పెద్దోళ్లకి తెలవకుండా, కళ్లు మూసుకుని ఏడుకునే ఓళ్లంట.

"అట్టా అట్టా, యాడాది తిరగే తలికి పాపాయమ్మ గారు మంచం ఎక్కారండి. అంతే, ఆయమ్మ కళ్లు మూసేదాకా పిచ్చిగంగి పాపమ్మ పక్క ఒదల లేదు. గంగమ్మని నిద్రా లేదు వణ్ణమూ లేదు, నీల్లూ లేవు. పాపాయమ్మకి అన్ని సేవలూ శేశింది, ఆయమ్మ కన్ను మూసి పెద్దల్లో కలిసిపోయేదాకా.

"ఇక నంతే నండి. గంగమ్మ అలిసిపోయే గుడి ముందరకొచ్చి పడిపోయిందండి. మేనత్త వణ్ణం తెస్తే తినలే. కనకమ్మ గారు పళ్లూ గట్రా ఏదైనా ఇస్తే తినలే. నీల్లిస్తే తాగలే. అట్టాగే పడి ఉండేది. కదలలే, మెదలలే. గాలి పట్టిందన్నారు. ఊరంతా ఒరిగి ఒరిగి వచ్చి శూశారండి. వారం దాటింది. అప్పుడు కూడా మేనత్త కడుపు ఆగక వణ్ణం తినమని బతిమాలితే, గంగమ్మ కళ్లల్లో నీళ్లు నిండినయి. కనకమ్మ భర్తగారు, వైద్యుణ్ణి తెస్తానమ్మా, కొంచం ముందు తినమన్నారండి. గంగమ్మ కళ్లల్లో నించీ నీళ్లు ధారగా జారి పడ్డాయండి. నిమ్మలంగా శేతులెత్తి దణ్ణం పెట్టింది, ఆయనకి. ఆయన పక్కనే ఉండా కనకమ్మగారు పరుగెత్తుకెల్లి, అమ్మోరి ముందర పడి డొల్లి డొల్లి ఏడ్చింది. పిచ్చి గంగి అప్పుడు మూసిన కళ్లేనండి. ప్రాణం పోయేదాకా తిరిగి తెరవనేలేదండి. తెల్లారక ముందరే జీవుడు ఒదిలేసింది.

"కనకమ్మగారూ, రూపులియ్య పక్కనే ఈ యమ్మకి కూడా సమాధి కట్టించ్చిందండి. అయ్యేనండి, బాబయ్యా, ఈ సమాధులు."

మాదయ్య ఒళ్లోనించీ పుగాకు తీస్తూ కాస్త ఆగి "కనకమ్మ గారు శచ్చిపోయేటప్పుడు పెద్దల్ని, పిల్చి, దణ్ణం పెట్టి, శెప్పిందండి, అన్నేళ్లూ ఆ యమ్మ కడుపులో పెట్టుకున్న ఆ రహస్యం."

అప్పటికి కాస్త తెప్పరిల్లి, "ఏమిటా రహస్యం?" అడిగింది, అత్తయ్య.

"అసలు, ఏనాడూ పిచ్చి గంగికి పిచ్చేలేదంటండి!" అన్నాడు మాదయ్య, పుగాకు చేత్తో ఊత ఇస్తూ.

దూరాన్నించీ, వస్తున్న చెప్పుల శబ్దం తప్ప, అంతా నిశ్శబ్దం, పెట్రోలు బరువుతో రాజు వస్తున్నాడు.

ఏ లోకంలోనించో భూలోకానికి వచ్చి పడ్డాం అందరమూ. అందరికంటే ముందర శాంతి లేచింది.

ఎప్పుడూ కనిపించని గాంభీర్యం ఏదో కనిపిం చింది, శాంతి ముఖంలో. రెండడుగులు వేసి వంగి నమస్కరించింది, ఆ సమాధులకి.

■